సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు టౌన్: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా 19 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలన్నారు. అందుబాటులో పలు శాఖలకు చెందిన అధికారులు ఉంటారని వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం త్వరగా జరిగేలా చూస్తామన్నారు. ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



తాండూరు టౌన్: సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు ఫిర్యాదు అందజేస్తున్న వృద్ధురాలు

క్రమంలో తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, పశువైద్యాధికారి గీత, ఏపీఎం రాజు, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి రెండు దరఖాస్తులు

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. బూర్గుపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు గతంలో పని చేయనని చెప్పి మళ్లీ పని చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. టేకులపల్లికి చెందిన మమత తన ఇంటి ఎదుటి ఖాళీ స్థలాన్ని ఇతరులు కబ్జా చేస్తున్నాడని ఫిర్యాదు చేసింది. విచారణ చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్య

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

మోమిన్‌పేట: ప్రభుత్వ బోరు బావి, మంచినీటి బావిని పూడ్చి కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని అట్టి భూమిని కాపాలడాలని గ్రామానికి చెందిన పులి సంగన్న గౌడు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి సోమవారం ఫిర్యాదు చేశాడు. మండల పరిధిలోని అంరాధికలాన గ్రామంలో పోతగారి బస్వరాజ్ బారుబావిని పూడ్చి కబ్జా చేస్తున్నాడని ఆరోపించాడు. ప్రభుత్వం అట్టి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరాడు.

దరఖాస్తులు నిల్

బంట్వారం: ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క ఫిర్యాదు అందలేదు. సోమవారం ఎంపీడీఓ రాములు, తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆయాశాఖల అధికారులు తమ కార్యాలయంలో వేచి ఉన్నప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి, జీరో బిల్లులకు దరఖాస్తులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు సమస్యలపై వినతులు అందించారు. మహాలక్ష్మి, జీరో విద్యుత్ బిల్లులపై దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ ఉషశ్రీ తెలిపారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్ సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రాములు, విద్యుత్ శాఖ, వసతిగృహ అధికారులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్



మోమిన్‌పేట: ప్రజావాణిలో ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు



మోమిన్‌పేట: తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి ఫిర్యాదు చేస్తున్న సంగన్నగౌడ్



బంట్వారం ప్రజావాణిలో అధికారులు

చక్రంపల్లి–హైదరాబాద్ సర్వీసు పునఃప్రారంభం

మోమిన్‌పేట: మండల పరిధిలోని చక్రంపల్లి గ్రామానికి ప్రభుత్వం ఆర్టీసి బస్సు సర్వీసు ప్రారంభించింది. గ్రామస్తుల కోరిక మేరకు రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశానుసారం నూతన సర్వీసు ప్రారంభించేందుకు వికారాబాద్ డిపో మేనేజరు ముందుకువచ్చారు. గతంలో ఈ గ్రామానికి ఉదయం, సాయంత్రం హైదరాబాద్ డిపోకు చెందిన బస్సును నడిపేవారన్నారు. ఐదేళ్లుగా ఆ సర్వీసు రద్దు చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించి హైదరాబాద్‌కు నూతన సర్వీసును పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, రాములు, నగేశ్, మొగులయ్య, మల్లయ్య, జంగారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చక్రంపల్లిలో నూతన బస్సు సర్వీసు ప్రారంభోత్సవంలో గ్రామస్తులు

ప్రశాంతంగా పీఆర్టీయూ ఎన్నికలు



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

బషీరాబాద్: పీఆర్టీయూ మండల కార్యవర్గానికి సోమవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతగా ముగిశాయి. ఆ సంఘం నుంచి రెండు ప్యానెల్స్ పోటీ చేయగా మాజీ అధ్యక్షుడు కేకే నర్సింహారెడ్డి రెండోసారి అధ్యక్షుడుగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.రవీందర్ మరో ప్యానెల్ నుంచి గెలుపొందారు. సోమవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో పీఆర్టీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిల ఎన్నికకు పోటీ నెలకొనడంతో ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలో పీఆర్టీయూ సంఘంలో సభ్యత్వం కలిగిన 187 మంది ఉపాధ్యాయులకు గాను 167 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ కరుణ, ఉపాధ్యాయులు నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. ఎన్నికల్లో పాల్గొనేందుకు ఉపాధ్యాయులు మూకుమ్మడిగా వెళ్లారు. దీంతో మధ్యాహ్నం నుంచి పాఠశాలలు మూతపడ్డాయి. ఈ విషయమై ఎంఈఓ సుధాకర్ రెడ్డిని వివరణ కోరగా కాంప్లెక్సు పరిధిలోని హెచ్‌ఎంలకు అక్కడి పాఠశాలల ఉపాధ్యాయులు సెలవు పెట్టిన విషయం తెలుస్తుందన్నారు.

నిర్బంధం అప్రజాస్వామికం

బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

అనంతగిరి: పేదల ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలో సభ్యుడైన వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్‌ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆనంద్‌ను హౌజ్ అరెస్ట్ చేసిన విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులకు అక్కడకు చేరుకున్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజారోగ్యం గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రామస్వామి, అనంత్‌రెడ్డి, గోపాల్, రాములు, కోఆప్షన్ సభ్యుడు షకీల్, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, పాండు, అనిల్, అశోక్, కిశోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్ నివాసం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు

సంగయ్యలొంకను అభివృద్ధి చేసుకుందాం

అనంతగిరి: మదన్‌పల్లి గ్రామంలోని సంగయ్యలొంక శివాలయాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని గ్రామస్తులు సూచించారు. ఈ మేరకు సోమవారం సంగయ్యలొంక ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 800 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 218లో 400పై చిలుకు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆలయం అదే భూమిలో ఉందని ఇందుకు నక్షమ్యాప్ సైతం ఉందని తెలిపారు. గతంలో అధికారులు రైతులకు 120 ఎకరాల వరకు అసైన్డ్ పట్టాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఆలయ పరిసరభూమి మాదంటూ ఓ వ్యక్తి ఆరోపిస్తున్నారన్నారు. రెండేళ్లుగా పనులు చేస్తున్నా పట్టించుకోని వారు ఇప్పుడు కొత్తగా వచ్చి భూమి తమదనడం సరికాదన్నారు. ఇదే విషయం త్వరలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వివరిస్తామన్నారు. అనంతగిరితో పాటు సంగయ్యలొంక ఆలయాన్ని సైతం ప్రభుత్వం అభివృద్ధి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆలయాభివృద్ధికి అందరూ కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో సదానంద రెడ్డి, కొండి రాములు, వెంకట్‌రెడ్డి, సిరియాల్, సంగయ్య, రాంచంద్రయ్య, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, అశోక్, నర్సింహారెడ్డి, కిష్టయ్య, మల్లేశం, లచ్చయ్య, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మట్లాడుతున్న మదన్‌పల్లి వాసులు

‘స్వచ్ఛతా హి సేవ’ విజయవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్

కొడంగల్ రూరల్: ప్రతీ ఒక్కరు పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తెలిపారు. సోమవారం పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్‌లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చెత్త బుట్టల్లో వేయాలని, తద్వారా కంపోస్టు తయారు చేయడం, పరిశుభ్రత పాటించడంతోనే ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందని చెప్పారు. వర్షాకాలం నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ భరత్‌కుమార్, నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ ప్రిన్స్‌పాల్ నరేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరి చేసుకోండి

తహసీల్దార్ విజయకుమార్



బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: ఓటరులిస్టులో తప్పులుంటే సరిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు ఇచ్చారు. బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితాను పరిశీలించాలన్నారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని.. 18ఏళ్లు నిండిన యువతకు ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

సాధన స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకుడు రాహుల్

ధారూరు: బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసిన నేరమేనని సాధన స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకుడు రాహుల్ అన్నారు. మండల పరిధిలోని అల్లిపూర్, చింతకుంట, హరిదాస్‌పల్లి, కేరెల్లి, ఎబ్బనూర్ గ్రామాల్లో బాల్య వివాహాల రిజిస్టర్లను గ్రామ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుక్త వయసు వచ్చాకే వివాహాలు చేయాలని.. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే పోలీసులకు, 1098, 100కు లేదా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ అంజయ్య, సోషల్ కమ్యూనిటీ మొబిలైజర్ శ్రీనివాస్, సాధన స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

పెండింగ్ కేసులను పరిష్కరించుకోండి

లోక్ అదాలత్‌లో రిటైర్డు జడ్జి సాంబశివుడు

చేవెళ్ల: వాహనదారులు పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ కేసులను పరిష్కరించుకునేందుకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు రిటైర్డు జడ్జి సాంబశివుడు అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో సోమవారం ట్రాఫిక్ కేసులపై లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసుల పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం 23 నుంచి 28వ తేదీవరకు ఉంటుందని తెలిపారు. మొదటిరోజు నిర్వహించిన లోక్ అదాలత్‌లో మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు 128 పరిష్కరించబడినట్లు తెలిపారు. వీటికి గాను జరిమానాగా 3లక్షల 41వేల రూపాయలు విధించామన్నారు. పెండింగ్ కేసులు ఉన్న వ్యక్తులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, కోర్టు స్టాఫ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



కేసులను పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివుడు, ట్రాఫిక్ సీఐ వెంకటేశం

స్వచ్ఛతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్: గ్రామాల స్వచ్ఛత, పారిశుద్ధ్య నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని ఎంపీడీఓ సంధ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని చిలుకూరులో గురువారం పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు గ్రామాలను స్వచ్ఛతగా ఉంచడంతో పాటు తమ ఆరోగ్యాన్ని కూడా చూసుకోవాలన్నారు. ఆరోగ్యానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందికి పీపీఈ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, మండల వైద్యాధికారి అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

చండీ ఉపాసకుడు రేవల్లి రాజేశ్‌శర్మ

షాద్‌నగర్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చండీ ఉపాసకుడు రేవల్లి రాజేశ్‌శర్మ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయాన్ని చండీ ఉపాసకుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించారు. దేవాలయ నిర్మాణంలో పాటించాల్సిన తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హిందూ దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దేవాలయాలు మన హిందూ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. దేవాలయాల పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలందరూ భగవన్నామస్మరణను అలవర్చుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అనంతరం రేవల్లి రాజేశ్‌శర్మను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అన్మారి వెంకటయ్య, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, జగన్‌మోహన్‌రెడ్డి, పల్లి యాదయ్య, సిరిగిద్ద అంజయ్య, శ్రీనివాస్, విజయ్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్, సిరిగిద్ద యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



రేవల్లి రాజేశ్‌శర్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్సీ పట్నంకు శుభాకాంక్షల వెల్లువ

తాండూరు: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం అట్టహాసంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.



కాంగ్రెస్ నాయకుడు బిర్కట్ రఘు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు



పట్నం మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు



మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహరాజ్

క్లుప్తంగా

నేడు వ్యాసరచన పోటీలు

కుల్కచర్ల: చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు యువజన సంఘాల సమాఖ్య మండల నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేష్, అశోక్, శ్రీను, యాదయ్య, శివకుమార్, రాము, నసీర్, బాలు, మణికంఠ, కృష్ణయ్య, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ చెకింగ్



గ్యాస్ సబ్సిడీకి ఆన్‌లైన్‌లో చెక్ చేయించుకుంటున్న మహిళలు

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై సబ్సిడీ ఇస్తుండడంతో మహిళలు మండల పరిషత్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వడంతో అర్హులు ఆన్‌లైన్‌లో సరిచూసుకుంటున్నారు. గ్యాస్ ఐడీ, కంపెనీ, ఆధార్, బ్యాంక్ అకౌంట్, రిజిస్ట్రేషన్ సరిపోల్చుకుని చూసుకుంటున్నారు. తొలుత గ్యాస్‌కు పూర్తిస్థాయిలో చెల్లించి తీసుకున్న అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ అకౌంట్లలో జమ చేస్తున్నారు. సబ్సిడీ పోగా రూ.500కే మహిళలకు వంట గ్యాస్ అందుతోందన్నారు.

అంబేడ్కర్ ప్రజా సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

దౌల్తాబాద్: మండల పరిధిలోని కుప్పగిరిలో సోమవారం అంబేడ్కర్ ప్రజాసంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెలమల్లేషం, తాలూక అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడిగా సాయిలు, ఉపాధ్యక్షులుగా మోహన్, నరేష్, ప్రధానకార్యదర్శిగా మహిపాల్, కోశాధికారిగా భానుచందర్ తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని గడపగడపకు చేరవేయాలన్నారు. డీవీఎంసీ సభ్యులు దస్తప్ప, మాసాని వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘన సన్మానం



ఎస్‌ఐ ఖాజాపాషా, ఆయన తండ్రిని సన్మానిస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం నుంచి ఎస్‌ఐగా శిక్షణ పూర్తి చేసుకున్న ఖాజాపాషాను పలువురు మైనార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం ఖాజాపాషా స్వస్థలానికి రావడంతో ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. వికారాబాద్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అఫ్జల్ షకీల్, హోంగార్డుల సంఘం రాష్ట్ర నాయకుడు చాంద్‌పాషా, మైనార్టీ యూత్ నాయకులు జహంగీర్, షఫీ, సిద్దిక్, సద్దాం, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి

కుల్కచర్ల: తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్ యాదవ్, చౌడాపూర్ మండల సంఘం అధ్యక్షుడు ప్యాట మల్లేశ్ అన్నారు. సోమవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రభులుకు తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వినిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కుర్వ సంఘం మండల కమిటీ

తాండూరు రూరల్: కుర్వ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం నిర్వహించారు. రెండేళ్ల పాటు కొనసాగనున్న ఈ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్.నర్సింలు, అధ్యక్షుడిగా జి. నర్సింలు, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్, కె.కిష్టప్ప, ప్రధాన కార్యదర్శిగా ఉల్లి నర్సింలు, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా దస్తప్ప, ప్రచార కార్యదర్శిగా రవి, సలహాదారులుగా శ్రీశైలం, కుర్వ సురేష్, శ్రీకాంత్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, పాండు, జగదీష్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట చెత్త వేయొద్దు

తుక్కుగూడ: మున్సిపాలిటీ ప్రజలు చెత్త ఆరుబయట వేయకుండా సిబ్బందికి అప్పగించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. సోమవారం స్వచ్ఛత హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. ఆరుబయట చెత్తవేయడం ద్వారా దోమలు, ఈగల సంఖ్య పెరిగి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని సూచించారు.